సాక్షి
సూర్యాపేట

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



అంత్యక్రియలకు వెళ్లొస్తూ..
అంత్యక్రియలకు వెళ్లొస్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో దంపతులు మృతిచెందారు.
- 8లో



మట్టపల్లిలో నిత్యకల్యాణం
మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- 8లో



బాగుపడ్డ గిరిజన బతుకులు
తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక గిరిజన బతుకులు బాగుపడ్డాయని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.
- 8లో

న్యూస్‌రీల్

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

చివ్వెంల: మండలంలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో చేపట్టిన విప్రహిత బ్రాహ్మణ సదనం భవన నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. అక్టోబర్ 1న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చివ్వెంల: సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో సీనియర్ న్యాయవాది ఎస్.లక్ష్మీకాంతారావుపై పేట పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంచర్ల సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్యయాదవ్, జాయింట్ సెక్రటరీ రాంపాక ఉప్పలయ్య, కోశాధికారి రాచకొండ యాదగిరి, లైబ్రరీ సెక్రటరీ కోణం రఘురామయ్య, గేమ్స్‌ కల్చరల్ సెక్రటరీ కోక రంజిత్‌కుమార్, సభ్యులు సుంకర రవికుమార్, టి.సైదులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో వైభవంగా శ్రీసుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి

చివ్వెంల: బాద్రపదమాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉండ్రుగొండ గ్రామ శివారులో గల గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీసుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమ పూజల్లో కూర్చున్నారు. పూజా కార్యక్రమాల్లో వేద పండితులు శ్రీమాన్ శ్రీకారాచార్యులు, శ్రీమాన్ కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్, బంధకవి కృష్ణమోహన్, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి

పెన్‌పహాడ్: 2024 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 5న ఢిల్లీలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా శుక్రవారం పెన్‌పహాడ్‌కు చేరుకున్న సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, ఉపాధ్యక్షురాలు మద్దెల జ్యోతి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ, గుంజా వెంకటేశ్వర్లు, బొలిశెట్టి భాస్కరమ్మ, జానీబేగం, మంజుల, కవిత, గోవర్ధనమ్మ, రమణ, సుజాత, కనకమ్మ, అమ్మని, శ్రావణి, మానస, సరస్వతి, వెంకటమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్ ఇన్



మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

కోదాడ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలపై శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రైయిన్‌లు, చెత్త పేరుకుపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు, నిల్వ ఉండడం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలిస్తారు.

తేది. 30.09.2023 (శనివారం)
సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
83744 50356

కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం

- కేసీఆర్ పథకాలే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష
- గాదరి కిషోర్‌కుమార్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించండి
- తుంగతుర్తి ఆశీర్వాద సభలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు కిషోర్, మల్లయ్య, ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు

తుంగతుర్తి: కాంగ్రెస్ పాలనలో కరువు నేలగా ఉన్న తుంగతుర్తి ప్రాంతం నేడు కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలమైంది. నాడు బీళ్లుగా ఉన్న భూములు నేడే పచ్చని పంట పొలాలుగు మారాయని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో రూ.45.45కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి, రూ.4కోట్లతో నాలుగు లేన్ల తుంగతుర్తి మెయిన్ రోడ్డు విస్తరణ, రూ.2.8కోట్లతో తుంగతుర్తి శివారులోని వెలుగుపల్లికి వెళ్లే రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం తుంగతుర్తి సంతలో ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్షగా మారాయన్నారు. తుంగతుర్తికి కిషోర్‌కుమార్ ఎమ్మెల్యే కావడం మీ అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో కిషోర్‌ను మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

50 ఏళ్లు పాలించి.. ఇప్పుడు అభివృద్ధి అంటున్నారు..

దేశంలోనే 24గంటల పాటు వ్యవసాయానికి ఉచిత కరెంట్‌ను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో కూడా 7గంటలు మాత్రమే ఇస్తున్నారన్నారు. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో పవర్ హాలీడేలు ప్రకటిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 3వేల గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. గత ఎన్నికల్లో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని చెప్పి, మిషన్ భగీరథ పథకం ద్వారా నీరందించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు.



జాజిరెడ్డిగూడెంలో విద్యాసాగర్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ

50 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ అప్పుడు అభివృద్ధి చేయకుండా ఇప్పుడు అభివృద్ధి మంత్రం జపిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. మోత్కూరులో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో నల్లగొండలో 12కు 12స్థానాలు బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కాసోజు శంకరమ్మ, నంద్యాల దయాకర్‌రెడ్డి, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్‌గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

విద్యాసాగర్‌రావు సేవలు మరువలేనివి

అర్వపల్లి: సాగునీటి రంగ నిపుణుడు దివంగత రామరాజు విద్యాసాగర్‌రావు తెలంగాణకు చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. జాజిరెడ్డిగూడెం, అర్వపల్లిలో శుక్రవారం ఆయన విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్‌తో కలిసి పర్యటించారు. తొలుత జాజిరెడ్డిగూడెంలో రూ.1.30కోట్లతో నిర్మించిన లక్ష్మీరాఘవరావు కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. మండపం ఎదుట నిర్మించిన సాగునీటి రంగ నిపుణుడు దివంగత రామరాజు విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. హోమంలో పాల్గొని పూజలు చేశారు. తర్వాత వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు ఎదుట ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. అర్వపల్లి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం జాజిరెడ్డిగూడెంలో విద్యాసాగర్‌రావు చిత్రపటానికి మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, దేవస్థాన చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మినేని స్రవంతిసతీష్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు బైరబోయిన సునితరామలింగయ్య, కుంభం ఉషారాణినాగరాజు, కనుకు శ్రీనివాస్, కడారి నరేష్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

యాదాద్రి, నల్లగొండ జిల్లాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో రూ.5.70 కోట్లతో చేపట్టనున్న 50పడకల ఆస్పత్రి భవనం, రూ.2.50కోట్లతో చేపట్టే శ్రీచెన్నకేశవ ఆలయం పునఃనిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు.
నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ రిజర్వాయర్ సమీపంలో రూ.101.62 కోట్లతో నిర్మించనున్న లిఫ్టు ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేశారు.
నకిరేకల్‌లో రూ.5.70 కోట్లతో చేపట్టనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన ఎస్టీఓ, గ్రంథాలయ భవనాలను ప్రారంభించారు.



అయిటిపాముల లిఫ్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే చిరుమర్తి



తుంగతుర్తిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ పాలనతో చుక్కనీరు లేదు : మంత్రి జగదీష్‌రెడ్డి



కాంగ్రెస్ పాలనలో తుంగతుర్తి ప్రాంతంలో రక్తపుటేరులు పారాయి కానీ, చుక్కనీరు రాలేదని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ప్రాంతంలో నీళ్లు గలగల సవ్వడితో పారుతున్నాయని పేర్కొన్నారు. నాడు బీడు భూములుగా ఉన్న ప్రాంతం నేడు పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుందని అన్నారు.

ప్రజల కల సహకారమైంది : ఎమ్మెల్యే కిషోర్‌కుమార్



తుంగతుర్తిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సహకారమైందని ఆశీర్వాద సభలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో కాళేశ్వరం జలాలు రావడంతో తుంగతుర్తి నియోజకవర్గంలోని బీడు భూములు సైతం పచ్చని పంట పొలాలుగా దర్శనమిస్తున్నాయన్నారు. తుంగతుర్తి నియోజవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తానన్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు కోరాగా వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

ఓటరు తుది జాబితా పక్కాగా రూపొందించాలి

- ఓటరు జాబితా పరిశీలకురాలు నిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రోరోల్ అబ్జర్వర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటరు తుది జాబితా పకడ్బందీగా రూపొందించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు కె.నిర్మల సూచించారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకట్రావుతో కలిసి ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. జిల్లాలో ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పుల దరఖాస్తులపై నాలుగు నియోజక వర్గాల్లోని మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పక నిర్వహించాలన్నారు. జిల్లాలో అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఫామ్–6, 7, 8లకు సంబంధించి మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఫామ్–6 ద్వారా 36,247 దరఖాస్తులు అందగా 33,882 పరిశీలించామని, ఫామ్–7 ద్వారా 22,774 దరఖాస్తులు అందగా 13,032 ఆమోదించామని, ఫామ్–8 ద్వారా 15,842 దరఖాస్తులు అందగా 13,698 ఆమోదించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డి, ఆర్‌డీఓలు కోదాడ సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయకుంటే గుణపాఠమే



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యాదవులు, జీఎంపీఎస్ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బొల్లం అశోక్ హెచ్చరించారు. రెండో విడత గొర్రెల కోసం జిల్లాలో డీడీలు చెల్లించిన ప్రతి ఒక్కరికీ పంపిణీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ టో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16,900 మంది లబ్ధిదారులు గొర్రెల కోసం డీడీలు కట్టి ఎదురుచూస్తున్న ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం..యాదవులకిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, జిల్లా జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు కంచుగొట్ల శ్రీనివాస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మోత్కుపల్లి?

బెంగళూరులో డీకేతో చర్చలు

- తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి
- సానుకూలత వ్యక్తం చేసిన శివకుమార్
- వచ్చే నెలలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో హస్తం గూటికి



బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కలిసిన నర్సింహులు

సాక్షి, యాదాద్రి : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ టికెట్ ఇస్తానని తనకు హామీ ఇచ్చిన కేసీఆర్.. ఆరు నెలలుగా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో హస్తం గూటికి చేరాలని డిసైడ్ అయ్యారు. శుక్రవారం ఆయన బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని కోరగా అందుకు డీకే సానుకూలత వ్యక్తం చేయడంతో వచ్చే నెలలో కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

ఏ పదవి దక్కని మోత్కుపల్లి

రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడో ఒక చోట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని మోత్కుపల్లి పర్సింహులు తన అభిప్రాయాన్ని పలుమార్లు వెల్లడించారు. అయితే సీఎం కేసీఆర్ సిట్టింగులకే సీట్లు కేటాయించడంతో ఆ అవకాశం లేకుండాపోయింది. కాగా బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న మోత్కుపల్లి.. కేసీఆర్‌ను నేరుగా కలిసి మాట్లాడాలని ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నా అవకాశం ఇవ్వడంలేదని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకం చైర్మన్ లేదా ఎమ్మెల్సీ, రాజ్యసభ ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్న మోత్కుపల్లికి ఏ అవకాశం కేసీఆర్ కల్పించలేదు.

తుంగతుర్తి నుంచి పోటీకి సంసిద్ధత

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న మోత్కుపల్లి వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల నియోజకవర్గంతో పాటు పలు చోట్ల మీడియా సమావేశాల్లో మోత్కుపల్లి అనుచరులు ప్రకటించారు. అయితే బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించినా సిట్టింగ్ కోటాలో తుంగతుర్తి నుంచి గాదరి కిషోర్‌కుమార్‌కు మూడవ సారి టికెట్ లభించింది. ఆలేరులో ఐదు సార్లు (టీడీపీ, ఇండిపెండెంట్, కాంగ్రెస్), తుంగతుర్తి నుంచి టీడీపీ తరఫున ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి అనంతరం టీడీపీలో చేరారు.అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి కాంగ్రెస్ నుంచి తుంగతుర్తిలో పోటీకి సిద్ధం అవుతున్నారు.

ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లోకి?

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సహ జిల్లాలోని ముఖ్యనేతలంతా కొంత కాలంగా మోత్కుపల్లితో టచ్‌లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి జిల్లాలో పార్టీకి సీనియర్ నేతగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర నేతల సూచన మేరకు బెంగళూరులో డీకే శివకుమార్‌ను కలిశారు. మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజనర్సింహ హైదారాబాద్‌లోని మోత్కుపల్లి ఇంటికి వచ్చి సుదీర్ఘంగా చర్చించడంతోపాటు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే జిల్లాలో సీనియర్ నేత మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు మోత్కుపల్లిని పార్టీలోకి రావాలని కోరినట్లు సమచారం. అయితే ఉమ్మడి జిల్లాలో పేరున్న మోత్కుపల్లి కాంగ్రెస్‌లో చేరిక బీఆర్‌ఎస్‌కు నష్టమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

జిల్లా మొదటి అదనపు కోర్టు ఏపీపీగా సవీందర్ కుమార్‌గౌడ్



చివ్వెంల: జిల్లా మొదటి అదనపు కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది నాతి సవీందర్ కుమార్ గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జితేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోంద్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి

- ఎస్పీ రాజేంద్రప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎస్పీ హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలు, నమోదైన కేసులు, ఎన్నికలకు సంబంధించిన తీసుకున్న చర్యలు మొదలగు అంశాలపై డీజీపీ సమీక్షించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత ఎన్నికల సమయంలో తీసుకున్న చర్యలను డీజీపీకి వివరించినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, కమ్యూనికేషన్ ఎస్ఐ రాంబాబు, సీసీ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అవగాహన సదస్సు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మిరప సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై ఆత్మకూర్ మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ మాట్లాడుతూ పంటలను ఆశించే చీడ పీడల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో భాగంగా రైతులు పొలంలో ఎకరానికి 50 చొప్పున పసుపు, నీలిరంగు మరియు తెలుపురంగు జిగురు అట్టలు అమర్చుకోవాలని, పంటలను ఆశించే దోమ, రెక్కల పురుగుల నివారణకు మినీ సోలార్ ట్రాప్ పెట్టుకోవడం ద్వారా 50 శాతం పైగా పురుగులు నివారించబడతాయని పేర్కొన్నారు. మిరపలో ఆశించే తామర పురుగు, నల్లి నివారణకు తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా వేపనూనె పిచికారీ, జీవ నియంత్రణ శిలీంధ్రాలైన బవేరియా, బాసియానా, వర్టిసీలియం లెకాని 5 మి.లీ. లీటరు నీటిలో వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కేవికే, గడ్డిపల్లి ఉద్యాన శాస్త్రవేత్త, సీహెచ్ నరేష్, రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు



పోలీసులు సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

చౌటుప్పల్: మండల పరిధిలోని ధర్మోజిగూడెం, లక్కారం, లింగోజిగూడెం, చౌటుప్పల్, కొయ్యలగూడెం గ్రామాల్లోని బెల్టుషాపులపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. 8 బెల్టుషాపుల్లో రూ.70వేల మద్యం బాటిళ్లను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం తిమ్మాపురం గ్రామానికి చెందిన గుడిపల్లి రవీందర్‌రెడ్డి(50) ఈ నెల 16న సూర్యాపేట–జనగామ 365బీబీ హైవే మీదుగా గ్రామ శివారులోని తన పొలం వద్దకు సైకిల్‌పై వెళ్తుండగా స్థానిక జియో పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉందని, బతకడం కష్టమని వైద్యులు చెప్పడంతో ఈ నెల 27న కుటుంబ సభ్యులు అతడిని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఇంటి వద్దనే స్థానిక వైద్యుడితో చికిత్స చేయిస్తుండగా.. శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ బి. అంజిరెడ్డి తెలి పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. అంజిరెడ్డి తెలిపారు.

తెలంగాణలో బాగుపడ్డ గిరిజన బతుకులు

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కొండమల్లేపల్లి, దేవరకొండ, దామరచర్ల మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



దేవరకొండ: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

దేవరకొండ, కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గిరిజన బతుకులు బాగుపడ్డాయని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె దేవరకొండ నియోజకవర్గంలో రూ.126 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో ఒకప్పుడు ఆడ శిశువులను అమ్ముకునే దుస్థితి ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేడు గిరిజనుల బతుకులు మారాయని అన్నారు. తెలంగాణలోని మూడు వేలకుపైగా తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలో ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి 24 గంటల ఉచిత విద్యుత్‌పై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని, అసలు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం పట్ల అవగాహన ఉండి మాట్లాడాడా... లేక మాట్లాడాడా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలను పొందుతున్నారని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కొండమల్లేపల్లిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థినుల మధ్యలో కూర్చొని ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండలోని బంజార భవనం పనులు పూర్తి చేసేందుకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా కొండమల్లేపల్లిలో బంజార భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు, నియోజకవర్గంలోని మరో మూడు రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్, కేశ్యతండాలకు చెందిన పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్, ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ట్రైకార్ చైర్మన్ రాంచంద్రనాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీరాములు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబనాయక్, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, మాధవరం సునితాజనార్దన్‌రావు, పద్మహన్మానాయక్, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఇలా..

దేవరకొండ మండలం కొమ్మేపల్లిలో నిర్మించిన గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల భవనం ప్రారంభించి అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. పెంచికల్‌పహాడ్‌లో వైటీసీ భవనాన్ని ప్రారంభించి పట్టణంలోని సాయి బాబా దేవాలయం వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కొండమల్లేపల్లి మండలంలోని కేశ్యతండాలో కేశ్యతండా నుంచి నాంపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు వయా కొత్తబావి, హంక్యతండా వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులకు, గుర్రపుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పన్నితండాలో సాగర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పన్నితండా వరకు రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు, అంతకుముందు దేవత్‌పల్లి గేటు వద్ద గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రూ.5 కోట్లతో చేపడుతున్న బాలికల అదనపు కళాశాల భవనం, రూ.2.70 కోట్లతో చేపడుతున్న బాలికల హాస్టల్ నిర్మాణ పనులకు, రూ.4.20 కోట్లతో చేపడుతున్న భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం



మిర్యాలగూడ : బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

మిర్యాలగూడ : రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని గాంధీనగర్ నుంచి కల్లేపల్లి వరకు బీటీ రోడ్డు, రూ.4.20 కోట్లతో దామరచర్ల మండల కేంద్రంలో నిర్మించనున్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు ఆమె ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతోపాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే అధిక వేతనం ఇస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఆమె కల్లేపల్లి గ్రామంలో వెలసిన బంగారు మైసమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాసులు, ఆర్డీఓ చెన్నయ్య, మార్కెట్ చైర్మన్ బుచ్చయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితహాతిరాం నాయక్, ఎంపీపీ నందినిరవితేజ, ఎంపీటీసీ పాచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి నుంచే విశ్వరూప విజయ యాత్ర

- మైసూరు శ్రీదత్త విజయానందతీర్థ స్వామిజీ



ప్రవచనాలు చేస్తున్న విజయానందతీర్థ స్వామిజీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం మైసూర్ దత్త విజయానందతీర్థ స్వామిజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రీశుడి సన్నిధిలోని శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో చతుర్మాస దీక్షను ముగించారు. అనంతరం యాదాద్రి కొండపైన స్వయంభూలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామిజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లోక కల్యాణార్థం విశ్వరూప విజయయాత్రను యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. యాదాద్రి ఆలయ శిల్పకళా సౌందర్యం అద్భుతంగా ఉందన్నారు. చాలా తక్కువ సమయంలో ఇలాంటి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వానికి, ఇంజనీర్లు, శిల్పులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ప్రవచించారు. స్వామిజీ వెంట ఈఓ గీతారెడ్డి, చీఫ్ ఆర్కిటెక్ట్ మధుసూదన్, ఆలయాధికారులు, అర్చకులు ఉన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం తగదు

భువనగిరి క్రైం: ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకి హైకోర్టు జరిమానా విధించిందనే విషయం వాస్తవం కాదని ఆమె తరపు న్యాయవాది ఎంఏ రహీం అన్నారు. విప్ సునీతకు హైకోర్టు రూ.10వేల జరిమానా విధించిందని ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో ఆమె తరపున వాదిస్తున్న న్యాయవాది ఎంఏ రహీం శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గొంగిడి సునీత తన ఆస్తులు వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుగా చూపెట్టారని సాయిని సతీష్‌కుమార్ 2019లో హైకోర్టులో కేసు వేశాడని అన్నారు. ఆ తర్వాతి కాలంలో సతీష్‌కుమార్ చనిపోగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి అదే కేసులో ఇంప్లిమెంట్ అయ్యి హైకోర్టు రూ.10వేల జరిమానా విధించారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని అన్నారు. తన క్లయింట్ గొంగిడి సునీత తన ఆస్తుల వివరాలను గజంతో సహా ఎన్నికల కమిషన్‌కు సమర్పించారని చెప్పారు. ఆమెపై తప్పుడు ప్రచారం చేస్తున్న బోరెడ్డి అయోధ్యరెడ్డిపై కోర్ట్ ఆఫ్ కంటెమ్ట్‌తో పాటుగా పరువు నష్టం దావా కూడా వేస్తున్నామని తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, శ్రీమూలవిరాట్‌కి పంచామృతాభిషేకం, అష్టోత్తర, సమస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం, మాంగళ్యధారణ జరిపించారు. ఆలయ కమిటీ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కారు అద్దం ధ్వంసం.

మోత్కూరు: పట్టణంలోని భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త అరవ సునీల్‌కుమార్ కారులో శుక్రవారం మోత్కూరుకు వచ్చి తన మిత్రుడు సైమన్‌తో కలిసి భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి వెళ్లారు. బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన సునీల్‌కుమార్ కారు వెనుక భాగంలోని కుడి వైపు అద్దంను గుర్తుతెలియని ధ్వంసం చేశారు. సునీల్‌కుమార్ బయటకు వచ్చి చేసేసరికి కారు అద్దం పగిలి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ నర్సింహనాయుడు పరిశీలించారు.

రాహుల్ గాంధీని కలిసిన వేముల వీరేశం



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఢిల్లీలో శుక్రవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాద పూర్వకంగా కలిశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మోత్కూరు: అప్పుల బాధతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన జినుకల అయిలయ్య(52)కు భార్య పద్మ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె వివాహం అయ్యింది. అయిలయ్య తనకున్న రెండెకరాల భూమిలో వరి పంట వేశాడు. మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. కుమార్తె పెళ్లితో పాటు పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. అప్పు విషయమై తండ్రీకొడుకుల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అయిలయ్య శుక్రవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి అయిలయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న అయిలయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పట్టపగలే ఆలయంలో చోరీకి యత్నం

నేరేడుచర్ల: పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి యత్నించారు. ఈ ఘటన శుక్రవారం నేరేడుచర్లలో చోటు చేసుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు మొలుగు శ్రీనివాసాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని విజయదుర్గ ఆలయంలో రోజు మాదిరిగానే పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 3గంటల సమయంలో గర్భగుడికి తాళం వేసి ప్రధాన అర్చకుడు ఇంటికి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు 4గంటల సమయంలో ఆలయంలోకి ప్రవేశించి రాడ్డుతో హుండీ తాళం పగుగొట్టి అందులో ఉన్న డబ్బులను దొంగిలించేందుకు ప్రయత్నించారు. గర్భగుడి తాళాలు పగులగొట్టేందుకు కూడా యత్నించి విఫలమయ్యారు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి వచ్చిన భక్తులు గమనించి పూజారికి సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న ఆలయ ప్రధాన అర్చకుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొణతం ఆదిరెడ్డితో పాటు కమిటీ సభ్యులు ఆలయానికి చేరుకొని పరిశీలించారు. గతంలో ఇదే ఆలయంలో దుండగులు అర్ధరాత్రి హుండీని ఎత్తుకెళ్లి నగదును దొంగలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి బ్రెయిన్ డెడ్

- అవయవదానం చేసిన కుటుంబసభ్యులు

సూర్యాపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. సూర్యాపేటలోని గిరినగర్‌కు చెందిన భారత రమేష్ ఐదు రోజుల క్రితం ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయన కళ్లు, కిడ్నీలు, గుండె, కాలెయం దానం చేశారు. కాగా.. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ధర్నా..

ఈనాడు కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి గిరినగర్ వాసులు ఆందోళనకు దిగారు. ఇటీవల తమ ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు వారు తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



రమావత్ జ్యోతి

త్రిపురారం: మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మహిళ అదృశ్యమైంది. శుక్రవారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామ పరిధిలోని గద్దగుండు తండాకు చెందిన ఒంటరి మహిళ రమావత్ జ్యోతి త్రిపురారం మండలంలోని లోక్యతండాలో ఉంటున్న తన అక్క ఇంటికి మూడు నెలల కిందట వచ్చి గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 21న తలనొప్పి ఉందని మిర్యాలగూడలో ఆస్పత్రికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన జ్యోతి తిరిగి ఇంటికి రాలేదు. తన ఫోన్ కూడా పనిచేయకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సింగం విజయ్‌పై అనుమానం ఉందని జ్యోతి అక్క భర్త ధనావత్ శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- దంపతులతో పాటు వారి కుమార్తె దుర్మరణం
- మరో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు
- ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద ఘటన
- మృతుల స్వస్థలం మునగాల మండలం వెంకట్రాంపురం ఆవాసం ఎస్‌ఎంపేట గ్రామం



సంతోష్‌కుమార్ (ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి



ఆస్పత్రిలో ఝాన్సీ మృతదేహం

మునగాల(కోదాడ): అంత్యక్రియలకు హాజరై వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి కుమార్తె మృతిచెందారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద ఈ ప్రమాదంలో మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుల స్వస్థలం మునగాల మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ ఆవాసం ఎస్‌ఎంపేట గ్రామం. వివరాలు.. ఎస్‌ఎంపేట గ్రామానికి చెందిన మందపెల్లి రామారావు, లక్ష్మయ్య అన్నదమ్ములు. రామారావు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. రామారావు కుమారుడు ఆస్ట్రేలియాలో ఉండడంతో అతడు వచ్చాక శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా లక్ష్మయ్య కుమారులు సంతోష్‌కుమార్, అరుణ్‌కుమార్ గత ఏడాది కాలంగా ఖమ్మం పట్టణంలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తమ పెద్దనాన్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రెండు కార్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఎస్‌ఎంపేటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో సంతోష్‌కుమార్‌తో పాటు భార్య ఝాన్సీరాణి, వారి ఇద్దరు కుమార్తెలు, అతడి తమ్ముడు(అరుణ్‌కుమార్) పిల్లలు ఇద్దరు కలిసి ఒక కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మందపల్లి సంతోష్‌కుమార్(38) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య ఝాన్సీరాణి(35)కి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణంలోని మమత హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని ఖమ్మం పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఇందులో సంతోష్‌కుమార్ పెద్ద కుమార్తె యోజిత(16) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాలను ఎస్‌ఎంపేటకు తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

త్రిపురారం: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన త్రిపురారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రంలో ఇందిరమ్మ కాలనీలో కందిమళ్ల శ్రీనివాస్‌రెడ్డి నివాసముంటున్నాడు. అతడు పని నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. 6 తులాల బంగారం, 60 తులాలు వెండి, రూ.13వేల నగదు దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

రాజాపేట: ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన రాజాపేట మండలంలోని జాల గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. జాల గ్రామానికి చెందిన మునిగంటి ఉమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటల జిల్లా గజ్వేల్ మండలంలోని ఆర్వీఎం ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో రాజాపేట మండలంలోని జాల గ్రామ శివారులోకి రాగానే కారులో మంటలు రావడంతో గమనించిన ఉమేష్ తన భార్య భార్గవి, కుమారుడితో కలిసి వెంటనే కారు దిగి దూరంగా పరిగెత్తారు. వెంటనే మంటలు పెద్దవై కారు పూర్తిగా దగ్ధమైంది. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



దగ్ధమవుతున్న కారు

మంత్రుల పర్యటనలో..



రామన్నపేట: చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



తుంగతుర్తిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి



నకిరేకల్‌లో డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే



తుంగతుర్తి సభకు వస్తున్న మంత్రులకు పూలు చల్లి స్వాగతం పలుకుతున్న ప్రజలు



నకిరేకల్ సభలో మంత్రి హరీశ్‌రావుతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



తుంగతుర్తిలో సాంస్కృతిక నృత్యాలతో సభకు వస్తున్న కళాకారులు



జాజిరెడ్డిగూడెంలో లక్ష్మీరాఘవరావు కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు